

భూత్పూర్ : ఆలయ ప్రాంగణంలో కూలిన ధ్వజస్తంభం



రాజాపూర్‌లో గాలికి కూలిన కుండల దుకాణం



తిమ్మాజిపేట : నేలకొరిగిన కోళ్ల షెడ్డు



రాజాపూర్ మండలంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఒకచోటుకు చేరుస్తున్న రైతులు



నవాబ్‌పేట : ఇప్పటూర్‌లో గాలికి ఎగిరిపోయి చెట్టుపై పడిన హోటల్ పై కప్పు



మూసాపేట : ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు



బిజినేపల్లి : విరిగిన స్తంభాలు

# అకాల వర్షం.. ఆగమాగం





ఇంద్రకల్ శివారులో నిర్మాణంలో ఉన్న రేకుల షెడ్డు కూలడంతో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు, తిమ్మాజిపేట : పిడుగుపాటుకు మృతి చెందిన వెంకటయ్య

## కూలిన బతుకులు


- నలుగురిని బలితీసుకున్న నిర్మాణంలో ఉన్న రేకులషెడ్డు
- యజమాని, కూతురు, ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి
- పిడుగుపాటుకు మరో ముగ్గురు..
- కారుపై రేకులు పడడంతో ఒకరు మృత్యువాత

నాగర్‌కర్నూల్, మే 26 (నమస్తే తెలంగాణ) : కందనూలులో గాలివాన ఎనిమిది మందిని బలి తీసుకున్నది. ఆదివారం మధ్యాహ్నం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షానికి భారీగా ఆస్తినష్టం సంభవించగా, నేలకొరిగిన వృక్షాలతో రాకపోకలకు అంతరాయం కలుగగా.. తెగిపడిన విద్యుత్ తీగలతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది.

***భారీ వర్షాలకు ఎనిమిది మంది మృతి..***

నాగర్‌కర్నూల్ జిల్లాలో అకాల వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. రోహిణి కార్తె ప్రారంభంలోనే అకాల వర్షానికి జిల్లా అతలాకుతలమైంది. ఆదివారం ఉదయం నుంచి ఎండతోపాటు ఆకాశం మేఘావృతమై తీవ్ర ఉక్కపోతగా ఉన్నది. మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. భారీగా ఈదురు గాలులు వీచగా.. వరుణుడు కూడా తోడయ్యాడు. దీంతో కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, పాలెం, తిమ్మాజిపేట, పెద్దూరు, చెన్నపురావుపల్లి, అచ్చంపేట ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. తిమ్మాజిపేట, అచ్చంపేటతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో మట్టి ఇండ్లు కూలిపోగా షెడ్లు, ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. చాలా చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడడంతో రాత్రి వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని తాడూర్ మండలం ఇంద్రకల్ శివారులో నిర్మాణంలో ఉన్న రేకుల షెడ్డు కూలి యజమాని మల్లేశ్(40 ), కూతురు అనూష(13)తో పాటు మరో ఇద్దరు అడ్డా కూలీలైన రాములు(45), చెన్నమ్మ(43) అక్కడికక్కడే మృతిచెందారు. పార్వతమ్మ, చిన్ననాగులు, నాగరాజు తీవ్రంగా గాయపడగా జిల్లా దవాఖానకు తరలించారు. తెలకపల్లిలో పిడుగుపాటుకు గుర్రె లక్ష్మణ్ (13), నందివడ్డెమాన్‌లో రైతు గోపాల్‌రెడ్డి (45) మృతిచెందారు. నాగర్‌కర్నూల్ మండలం మంతటిశివారులో రేకులషెడ్డు ఎగిరిపోయి పక్కనే ఉన్న కారుపై పడడంతో వేణుగోపాల్(40) స్పాట్‌లోనే చనిపోయాడు. అలాగే తిమ్మాజిపేట మండలం మారేపల్లి గ్రామంలో పిడుగుపాటు తీవ్రతకు వెంకటయ్య (52) మృతి చెందాడు. జిల్లా కేంద్రంలో గాలివాన ప్రభావంతో రోడ్లన్నీ జలమయమవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

భూత్పూర్/కల్వకుర్తి/కోస్గి/వెల్దండ/మూసాపేట/నవాబ్‌పేట/ తిమ్మాజిపేట, మే 26 : భూత్పూర్ మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతోపాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భూత్పూర్‌లోని శ్రీమునిరంగస్వామి ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభం నేలకొరిగింది. కల్వకుర్తి పట్టణంలోని పలు కాలనీల్లో చెట్లు ఈదురుగాలులకు విరిగి రోడ్లకు అడ్డంగా పడిపోయాయి. కోస్గిలో జరిగే వారాంతపు సంత అతలాకుతలమవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రామాలయం చౌరస్తా వద్ద ఉన్న హైమాస్ట్ లైట్ స్తంభం విరిగి కరెంట్ తీగలపై పడిపోగా.. పోల్లేపల్లి, ముశ్రీఫా గ్రామాల్లో చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. వెల్దండ మండలం చౌదర్‌పల్లిలో రైతు ఒట్టు బాలకిష్టయ్య పొలంలోని తుమ్మచెట్టుపై పిడుగుపడింది. ఆ సమయంలో చెట్టుకింద ఉన్న ఆవు మృతి చెందగా, బాలకిష్టయ్య అస్వస్థతకు గురికావడంతో హైదరాబాద్‌కు తరలించారు. కొత్త పరిధిలోని కల్వకుర్తి-హైదరాబాద్ రహదారిపై భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడడంతో అరగంట పాటు రాకపోకలు స్తంభించిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు. పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మూసాపేట మండలం సంకలమద్ది గ్రామంలో రేషన్ డీలర్ మేకల వాసుదేవమ్మ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విద్యుత్ తీగలు తెగిపడగా సిబ్బంది మరమ్మతులు చేపట్టి కరెంట్‌ను పునరుద్ధరించారు. నవాబ్‌పేట మండలం ఇప్పటూర్‌లో సత్యం నిర్వహిస్తున్న రేకుల హోటల్ ఎగిరిపోయింది. గ్రామంలో కరెంట్ స్తంభాలు విరిగి ఇండ్లు, వాహనాలపై పడి తీవ్ర నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో మామిడికాయలు రాలిపోగా.. మరికొన్ని చోట్ల ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. తిమ్మాజిపేట మండలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మారేపల్లి, మారేపల్లి కాలనీల్లో మూడు ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపోగా.. కరుణాకర్‌రెడ్డి కోళ్లషెడ్డు కుప్పకూలిపోయింది. ఈదురుగాలులకు ట్రాక్టర్ ట్రాలీ తిరగబడిపోగా.. మారేపల్లి, బాజీపూర్‌లో విద్యుత్తు స్తంభాలు, చెట్లు విరిగాయి. దీంతో రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



నవాబ్‌పేట : నేలమట్టమైన విద్యుత్ స్తంభం

- పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం
- అక్కడక్కడ నేలకొరిగిన చెట్లు, కరెంట్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- వెల్దండ మండలంలో పిడుగుపడి కాడెద్దు మృతి
- అస్వస్థతకు గురైన రైతు, హైదరాబాద్‌కు తరలింపు









కోస్గి : రామాలయం వద్ద విరిగిపడిన హైమాస్ట్ లైట్, తిమ్మాజిపేటలో గాలికి పడిపోయిన ట్రాక్టర్, వెల్దండ : చౌదర్‌పల్లిలో పిడుగుపాటుకు మృతి చెందిన పాడి ఆవు, కోస్గి : ముశ్రీఫాలో రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

## ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి



మృతదేహంతో నిరసనలు తెలుపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

రాజోళి, మే 26 : మండల కేంద్రంలో తుమ్మలపల్లి శివారులో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కర్నూల్ జిల్లా కొంతలపాడుకు చెందిన చంద్రశేఖర్(19) రాజోళి నుంచి తూర్పు గార్లపాడు గ్రామం వైపు వెళ్తుండగా తూర్పుగార్లపాడుకు చెందిన టీఎస్ 06ఈవీ5159 నెంబర్ గల ట్రాక్టర్ మట్టిలోడ్‌తో వస్తూ వెనుకనుంచి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ట్రాక్టర్ యజమాని ఇంటి ఎదుట ఉంచి ఆందోళన నిర్వహించారు. కాగా ఇంటిముందే అంత్యక్రియలు చేస్తామని బైఠాయించారు. విషయం తెలుసుకున్న శాంతినగర్ సీఐ రత్నం పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. ఎంతసేపటికి వినకపోగా తప్పకుండా మృతికి కారణమైన వ్యక్తులను చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కాగా, ఘటనపై ఇంకా పూర్తి వివరాల్లో భాగంగా ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

లింగాల, మే 26 : చేసిన అప్పులు తీర్చలేక.. కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొత్తకుంటపల్లిలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, ఎస్సై జగన్మోహన్ కథనం ప్రకారం.. మండలంలోని కొత్తకుంటపల్లికి చెందిన శశాంక్‌రెడ్డి(32) బెట్టింగ్‌లు, ఇతర అలవాట్లకు బానిసగా మారి రూ.లక్ష అప్పు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో హైదరాబాద్ నుంచి లింగాలలోని తమ మామిడితోటకు చేరుకొని ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆదివారం తోటకు వెళ్లిన కుటుంబ సభ్యులకు చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు.

మృతుడి తండ్రి విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అలంకారప్రాయంగా!

- రైతువేదికల నిర్వహణ గాలికి..
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు
- నిధుల లేమితో భారంగా నిర్వహణ
- భారీగా పేరుకుపోయిన విద్యుత్ బిల్లులు



లోపలి భాగం అపరిశుభ్రంగా ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా చందాయపల్లి రైతువేదిక


నాగర్‌కర్నూల్, మే 26 (నమస్తే తెలంగాణ) : దేశానికి అన్నం పెట్టే రైతు బాగుకోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేయని పథకాలు, చేపట్టలేని చర్యలు లేవు. నిరంతర ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా, అందుబాటులో ఎరువులు, విత్తనాలు, కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలు ఇలా.. ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పనులు అమలు చేసింది. ఇందులో భాగంగా ప్రతి కుల సంఘానికి భవనాలు ఉన్నట్లుగానే రైతులకూ రైతు వేదికల రూపంలో వ్యవసాయ క్లస్టర్ల వారీగా భవనాల నిర్మాణం చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ భవనాల నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో రైతువేదికలు నిరుపయోగంగా మారాయి.

నాగర్‌కర్నూల్ జిల్లాలో జిల్లాలో 143 రైతు వేదికలు నిర్మించారు. రైతులకు సాగు సలహాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన నిర్మాణాల లక్ష్యం నీరుగారిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో వ్యవసాయ క్లస్టర్ల వారీగా రూ.25 లక్షలతో రైతు వేదికలను నిర్మించింది. వ్యవసాయ శాఖలో క్షేత్ర అధికారులుగా ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారులు ఈ వేదికల ద్వారా రైతులకు అందుబాటులో ఉన్నారు. ప్రతి వ్యవసాయ సీజన్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులపై సమాచారం, మారుతున్న కాలానుగుణంగా కర్షకులకు సూచనలు, రైతుబంధు, రైతుబీమా, కిసాన్ సమ్మాన్ యోజన, ఇతర రైతు సంబంధిత వ్యవహారాలకు ఈ వేదికలు కేంద్ర బిందువుగా మారాయి. వారానికోసారి రైతుల సమావేశాలు నిర్వహించేవారు. ఇందులో ఏఈవోకు, రైతుబంధు సమితి అధ్యక్షుడు, సభ్యులు, రైతులకు, కుర్చీలు, టేబుళ్లలాంటి ఫర్నీచర్ కూడా ఏర్పాటు చేసింది. ప్రతి కుల, యువజన సంఘాలకు ఉన్నట్లుగా దేశానికి అన్నం పెట్టే రైతుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ వేదికలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. కానీ రేవంత్ సర్కారు వచ్చాక ఇవి అలంకార ప్రాయంగా మారాయి. క్లస్టర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈ వేదికలు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. చాలా వేదికలను తెరిచేందుకు ఏఈవోలు ముందుకు రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ శివార్లలో ఉన్న రైతు వేదికలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. బీఆర్‌ఎస్ పాలనలో ఏఈవోలు తప్పనిసరిగా రైతు వేదికల ద్వారానే రైతులకు అందుబాటులో ఉంటూ వచ్చారు. కాగా ప్రభుత్వం మారాక వ్యవసాయ శాఖ, ఏఈవోలు పట్టించుకోవడం మానేశారు. చాలా వేదికలు తాళాలు కూడా తీయక దుమ్ము, ధూళితో నిండిపోయాయి. గతంలో వేదికల నిర్వహణకు నెలకు రూ.9 వేల చొప్పున గత ప్రభుత్వం మంజూరు చేయగా.. విద్యుత్ చార్జీలకు రూ.1000, స్వీపర్‌కు రూ.3 వేలు, పారిశుధ్యానికి రూ. 2,500, మరమ్మతులు, స్టేషనరీ, జిరాక్స్, రైతుల శిక్షణకు రూ.1000, తాగునీటికి రూ. 500 చొప్పున మంజూరయ్యాయి. ఈ నిధులు ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వడం లేదు. దీంతో వేదికలు లక్ష్యానికి దూరంగా నిలిచే పరిస్థితులు తలెత్తాయి. రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించేలా నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఆధునీకరించారు కూడా. అన్ని చోట్లా ఇలాంటి ఏర్పాట్లు చేయాల్సి ఉన్నది. తొలుత చేసిన భూసార పరీక్షలూ ఇప్పుడు చేపట్టడం లేదు. ఇక రైతు వేదికలకు విద్యుత్ బకాయిలు భారంగా మారాయి. ప్రతి చోటా రూ.5వేల నుంచి రూ. 6 వేల వరకు బకాయిలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇది ఏఈవోలకు ఇబ్బందికరంగా మారింది. రైతులు మండల కేంద్రాలకు రాకుండా అందుబాటులోనే ఉండేలా చేపట్టిన ఈ వేదికలు నిరుపయోగంగా మారాయి.



చందాయపల్లి రైతువేదికలో మద్యం తాగి వదిలేసిన బాటిళ్లు

### ఏఈవోలకు ఆదేశాలిచ్చాం..



జిల్లాలో ఉన్న 143 రైతు వేదికలకు ఇంతకు ముందు తొమ్మిది నెలల పాటు రూ.9 వేల చొప్పున నిర్వహణ నిధులు వచ్చాయి. వేదికల వద్ద రైతులకు అందుబాటులో ఉండాలని ఏఈవోలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. రైతులు ఏ సమస్యలున్నా ఇక్కడికి వెళ్లి వ్యవసాయ అధికారులతో మాట్లాడాలి. సాగు సమస్యలపై, పథకాల అమలుపై తగిన సమాచారం, సలహాలు తీసుకోవాలి. రైతు వేదికల్లో కార్యకలాపాలు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

**- చంద్రశేఖర్, డీఏవో, నాగర్‌కర్నూల్**